NIGHT
LA NUIT
ELIE WIESEL

# కాళరాత్రి


రచన
**ఎలీ వీజల్**

అనువాదం
**వెనిగళ్ళ కోమల**




# NIGHT

**Elie Wiesel**


**Les editions De Minuit**

7, Rue Bernard - Palissy - 75006 Paris

Permitted to Publish
Telugu Translation of **NIGHT**
**by Komala Venigalla**

**First Edition :**

April 2017

**For Copies :**

**D. Nagalakshmi**
Divyasakthi House
Krishna Block, 309
Navodaya Colony
Srinagar Colony
Hyderabad - 500 073. (India)

DTP
**Damaraju Nagalakshmi**
Cell : 9912940182

Rs. 100/- $.10

Printed at
**Kala Jyothi Process Pvt. Ltd.**
1-1-60/5, RTC Cross Roads
Musheerabad,
Hyderabad - 500 020. India

# కాళరాత్రి

అతన్ని అందరూ మోషే ది బీడిల్ అనే పిలిచేవారు. అతనికి ఎప్పటికీ ఇంటి పేరంటూ లేనట్లే. హసిడిక్ ప్రార్థనా మందిరంలో అన్ని పనులూ చక్క బెట్టేవాడు. ట్రాన్‌సిల్వేనియాలో చిన్నపట్నం సిఘెట్ – అక్కడే నా బాల్యం గడిచింది. ఆ పట్నంలో అందరికీ అతను ఇష్టుడు. అతను చాలా పేదవాడు. మా ఊరివాళ్ళు పేదవాళ్ళను ఆదుకునేవారు. కాని వాళ్ళంటే యిష్టపడేవాళ్ళు కాదు. కానీ మోషే ది బీడిల్ సంగతి వేరు. అతను ఎవరి పనులకూ అడ్డువచ్చేవాడు కాదు. ఎవరికీ ఇబ్బంది కలిగించేవాడు కాదు. అందరి దృష్టి నుండి తప్పించుకొనటమే నేర్చుకుని గడిపాడు.

చూడటానికి సర్కస్ బఫూన్ మాదిరి ఉండేవాడు. అతను సిగ్గుపడటం అందరికీ నవ్వు తెప్పించేది. కాని నాకు మాత్రం అతని పెద్దకళ్ళు, ఏదో స్వప్న జగత్తులో ఉన్నట్లు వుండే అతని చూపు అంటే చాలా యిష్టం. తక్కువ మాట్లాడేవాడు. పాడుతూ ఉండేవాడు. అతని పాటలు ప్రార్థనలాగా అనిపించేవి. బహిష్కరణకు గురైన షేఖినా బాధలు అనిపించేవి నాకు అతన్ని వింటుంటే.

అతన్ని నేను 1941లో కలిశాను. నాకప్పుడు 13 ఏళ్ళు. అతన్ని నిశితంగా పరిశీలించేవాడిని. నేను పగలు టల్ముడ్ చదివేవాడిని. రాత్రిపూట సినెగాగ్ (మందిరం)కు వెళ్ళేవాడిని. మందిరాన్ని కూల్చటం గురించి ఏడ్చేవాడిని.

ఒకనాడు మా నాన్నను అడిగాను. నాకు కబాలా (దేవుడు సృష్టిమర్మం గురించి లోతుగా పరిశీలన) పఠించడం నేర్పడానికి ఒక మాష్టర్ని కుదర్చమని. "నీవు ఇంకా చిన్నవాడివి. మై మోని డేస్ ప్రకారం 30 ఏళ్ళు వచ్చేదాకా మార్మికవాదం గురించి తెలుసుకోవాలని ప్రయత్నించకూడదు. ప్రపంచంలో ఎన్నో బాధలున్నాయి. నీవు ముందు నీ చదువు కానివ్వు. అప్పటికి అన్ని తెలుసుకోగలుగుతావు" అన్నాడు నాన్న.

మా నాన్న చాలా సంస్కారం గలవాడు. సెంటిమెంట్స్ లేనివాడు. తన కుటుంబీకుల ముందు కూడా తన ఆలోచనలను తెలియజేసేవాడు కాదు. తనవారికంటే అన్యుల శ్రేయస్సు మీద

ఎక్కువ దృష్టి పెట్టేవాడు. సిఘెట్‌లో ఆయన సలహా సంప్రదింపులకు ఎక్కువ విలువ ఉండేది. మేము నలుగురం పిల్లలం – హిల్డా, బయా, నేను మూడవ వాడిని, ఏకైక పుత్రుడిని – జిపోరా ఆఖరిది.

అమ్మా నాన్నా ఒక షాపు నడిపేవారు. అక్కలిద్దరూ వారికి సాయపడేవారు. నేను చదువుకోవాలనే చెప్పేవారు.

సిఘెట్‌లో కబాలిస్టులు లేరు అని నాన్నెప్పుడు అంటూండే వాడు.

కబాలా చదవాలనే నా జిజ్ఞాసను తుడిచెయ్యాలనే ప్రయత్నించేవాడు. కాని అది సాధ్యం కాలేదు. నేను మోషే ది బీడిల్‌ను నా గురువుగా ఎన్నుకున్నాను.

ఒక సాయంసంధ్యవేళ నేను ప్రార్థిస్తుంటే అతను నన్ను గమనించాడు.

నన్ను ఎరిగినవాడులా దగ్గరకొచ్చి "ప్రార్థన చేస్తూ ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగాడు.

నాకు తెలియదు అన్నాను. నన్ను నేను ఎప్పుడూ ఆ విషయంగా ప్రశ్నించుకోలేదు. నాలో నుండి దుఃఖం పొర్లు కొచ్చేది. ఏడ్చేవాడిని – అంతే.

"అసలు ప్రార్థన ఎందుకు చేస్తున్నావు?" అని అడిగాడు.

అది వింత ప్రశ్న – నేను ఎందుకు ప్రార్థన చేస్తున్నాను అనేది. నేను ఎందుకు బ్రతుకుతున్నాను? ఎందుకు నాకు శ్వాస ఆడుతున్నది?

అప్పటి నుండి రోజూ అతన్ని కలిసేవాడిని. ప్రతి ప్రశ్న శక్తివంతమయింది. కాని సమాధానం అంత బలంగా ఉండదంటూ చాలా లోతు విషయాలు చెప్పేవాడు.

ప్రశ్నించటం ద్వారానే మనిషి దేవునికి దగ్గరవుతాడు. కాని మనకు అది అర్థం అవదు. అవి మనలో నిక్షిప్తం అయి ఉంటాయి మనం చనిపోయే వరకూ. అసలైన సమాధానాలు నీలోనే ఉన్నాయని తెలుసుకుంటావు అని నాకు చెప్పేవాడు.

“మోషే నీవు ప్రార్థన ఎందుకు చేస్తావు?” అని అడిగాను అతడిని.

“నాలోని దేవుడిని ప్రార్థిస్తాను. ప్రశ్నించగల శక్తి నా కివ్వ”మని అన్నాడు.

అలా రోజూ సాయంత్రం సినెగాగ్‌లో అందరూ వెళ్ళి పోయాక కూర్చుని మాట్లాడుకునేవాళ్ళం.

సిఫెట్‌లో కబాలిస్టు విషయాలు గాని యూదుల మార్మికవాదం గురించి గాని నాకు తెలిపేవారు లేరని ఒకనాడు వాపోయాను. మార్మికత తెలుసుకోవాలంటే వేలకొలది మార్గాలున్నాయి. ఎవరి మార్గం వారికుంటుంది. తప్పు త్రోవన ప్రవేశించరాదన్నాడు.

అలా మోషే గంటల తరబడి కబాలాల గురించి మార్మికవాదం గురించి నాతో చెపుతూ ఉండేవాడు. అలా నా శిష్యరికం మొదలయింది. ఇద్దరం జోహార్ పేజీలు పదేపదే

చదువుతుండేవాళ్ళం. అది కంఠస్తం పట్టటం కాదు. అందులోని దైవత్వం గురించి ఆకళింపు చేసుకునే ప్రయత్నమే అది.

మోషేయే నాకు దైవత్వం గురించి చెప్పగలడని, ఒకనాటికి ప్రశ్నలూ సమాధానాలు ఒకటవుతాయని నేను తెలుసుకోగలనని నమ్మకం కుదిరింది.

ఒకనాడు విదేశీ యూదులనందరినీ వెలివేశారు. మోషే వారిలో ఒకడు.

హంగరీ పోలీసులు వాళ్ళందరినీ పశువుల బండ్లలోకి కుక్కారు. వాళ్ళు నిశ్శబ్దంగా రోదించారు. స్టేషన్ ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి మేమూ ఏడ్చాము. నల్లటి పొగలు కక్కుతూ రైలుబండి వారితో వెళ్ళిపోయింది.

నా వెనకెవరో ఇంకేమి జరుగుతుందనుకుంటున్నావు. ఇది యుద్ధం అన్నారు. వెళ్ళగొట్టబడిన వారి గురించి అందరూ త్వరలోనే మరచిపోయారు. వాళ్ళు గెలీసియాలో పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నారంటూ పుకార్లు వినిపించాయి.

జీవితం గాడిన పడింది. షాపుల వాళ్ళు తమ వ్యాపారం బాగా కొనసాగించారు. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పిల్లలు ఎప్పటి మాదిరిగానే రోడ్లమీద ఆడుకుంటున్నారు.

ఒకనాడు నేను సినెగాగ్ వెళుతుంటే మోషే ఒక బల్లమీద కూర్చుని కనిపించాడు.

బహిష్కరింపబడినవారితో బయలుదేరిన బండి ప్రయాణం సంగతులు చెప్పాడు.

బండి హరారే సరిహద్దు దాటి పోలెండ్‌లోకి ప్రవేశించగానే గెస్టాపో (జర్మనీ రహస్య పోలీసులు) అధీనంలోకి తీసుకున్నారు. బండి ఆపి యూదులందరినీ దిగమన్నారు. బయట ఉన్న ట్రక్కులలోకి ఎక్కమన్నారు. ట్రక్కులు ఒక అడవి వైపుకు చేరాక అందరినీ దిగమన్నారు. వారిని పెద్ద కుంటలు త్రవ్వమన్నారు. గస్టాపోలు ఒక్కొక్కరిని వరుస బెట్టి కాల్చి చంపారు. పసివాళ్ళను గాలిలోకి ఎగురవేసి కాల్చారు. ఇది జరిగింది కలామే దగ్గరలోని గెలీసియా అడవి దగ్గర. మోషేని కాళ్ళవైపు కాల్చగా పడిపోయాడు. చనిపోయాడని వదలి వెళ్ళారు.

రాత్రింబగళ్ళు నడుస్తూ జరిగిన సంఘటన గురించి యూదుల యిళ్ళకెళ్ళి చెప్పాడు. మాల్కా అనే అమ్మాయి మృత్యువుతో పోరాడటం గురించి, టోబీ అనే టెయిలర్ తన కొడుకుల కంటే ముందు తనని చంపమని వేడుకున్నాడు అని చెప్పాడు.

మోషేలో చాలా మార్పు వచ్చింది. పాడటం మానేశాడు. అతనిలోని సంతోషం యిగిరిపోయింది. దేవుని గురించి, కబాలా గురించి ప్రస్తావించటం లేదు. తాను చూసిన దాని గురించే మాట్లాడాడు. జనం అతన్ని నమ్మలేదు, వినటం కూడా మానేశారు. కొందరు జాలిపడటం కోసం కల్పించి చెపుతున్నాడన్నారు. మరి కొందరు అతనికి మతి భ్రమించిందన్నారు.

కానీ, మోషే ఏడుస్తూ బ్రతిమలాడాడు. “నేను చెప్పేది వినండి చాలు బాబు, మీ డబ్బు, దయా నాకు వద్దు. మీరు

వింటే చాలు” అని సినెగాగ్‌లో ప్రార్థనల మధ్య గట్టిగా అరిచేవాడు. నేనూ నమ్మలేదు. అతను చెప్పేది వింటూ ఉండేవాడిని, జాలి పడ్డాను.

“నేను పిచ్చివాడిననుకుంటున్నారు” అంటూ కన్నీరు కార్చేవాడు.

“జనం నిన్ను నమ్మాలని ఎందుకనుకుంటున్నావు, నేనైతే వాళ్ళను లెక్కచేయను” అన్నాను.

కాసేపు కళ్ళు మూసుకుని – “నీకర్థం కాదు. నేను దైవికంగా బయటపడ్డాను, తిరిగి వచ్చాను. నా చావు అనుభవం మీకందరికీ చెప్పి, మీ అందరికీ యింకా వ్యవధి ఉంది, సావధానులు కండి అని చెపుతున్నాను. నాకు బ్రతకాలనే ఆశ లేదు. నేను ఒంటరివాడను. మీ అందరికీ వార్నింగ్ యిద్దామని చెపుతున్నాను. కానీ ఎవరూ వినటం లేదు” అన్నాడు.

ఇది 1942 చివరలో జరిగింది. అటు తరువాత జీవితాలు మామూలుగా సాగుతున్నాయి.

రోజూ లండన్, రేడియో వింటుండే వాళ్ళం. జర్మనీ స్టాలిన్ గ్రాడ్ బాంబింగ్సు గురించి వింటుంటే సిఘెట్‌లోని యూదు లందరూ తమకు మంచి రోజులు రానున్నాయని నమ్మారు.

నా చదువు యథావిధిగా కొనసాగించాను – పగలు టల్‌ముడ్, రాత్రి కబాలా! నాన్న తన వ్యాపారం నడుపుతూ

కమ్యూనిటీ బాగోగులు చూస్తుండేవాడు. మా తాత రోష్‌హానా మాతో గడపటానికి వచ్చాడు. బోర్ష్ రబీ ప్రవచనాలు వినటానికి అదే అదును. అమ్మ హిల్డాకి మంచి సంబంధం చూడాలనుకుంటున్నది.

అలా 1943 గడిచిపోయింది. 1944 వసంతకాలం – రష్యన్ ఫ్రంట్ నుంచి శుభవార్త జర్మనీ ఓడిపోబోతున్నది, నెలలో, వారాలో గడవాలంతే.

చెట్లు ఆకులు, పూలతో నిండుతున్నాయి. పెళ్ళిళ్ళు, శుభ కార్యాలు, జననాలు మామూలుగా జరుగుతున్నాయి. ఎర్రసైన్యం ముందుకు సాగుతున్నది. హిట్లర్ మనకు హాని తలపెట్టినా సాధించలేడు.

మమ్మల్ని మట్టుపెట్టాలనే అతని ఆలోచన వమ్ము అవుతుంది.

ఒక జాతినంతా మట్టుపెట్టటమా – ఎన్నో దేశాలలో స్థిరపడిన జనాన్ని తుడిచి పెట్టటమా? ఎన్నో మిలియన్ల ప్రజలను, ఈ 20వ శతాబ్దంలో ఎలా మట్టుపెడతారు?

మా పెద్దలంతా రాజకీయాలు, ఎత్తులూ, సమాధాన పరచటం, నిజం అంటూ ఎన్నో విషయాల గురించి తికమక పడుతున్నారు. వాళ్ళ గతేమిటో వారికి తెలియదు.

మోషే ది బీడిల్ గూడా శబ్దం చేయడం లేదు. మాట్లాడి మాట్లాడి అలసి పోయాడు. సినెగాగ్‌లోనికి, రోడ్ల మీద తిరుగుతుంటాడు. ఎవరి వైపూ చూడటం లేదు.

ఆ రోజుల్లో పాలస్తీనా ఇమిగ్రేషన్ సర్టిఫికెట్లు కొనే వీలున్నది. నాన్నను వ్యాపారం కట్టిపెట్టి వెళ్ళిపోదామన్నాను.

"నాకు వయసు మీదపడుతున్నది. కొత్త చోటుకు వెళ్ళి జీవితం ప్రారంభించగల శక్తి లేదు" అన్నాడు.

బుడాఫెస్ట్ రేడియో వార్తలు – "పాసిస్టు పార్టీ పవరు చేపట్టింది" రీజెంట్ మికోస్‌హోర్థిని బలవంతపెడుతున్నారు. ప్రానాజ్ నిలాస్ పార్టీ లీడర్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేయమని. అయినా మేము ఏమీ ఆందోళన చెందలేదు ఫాసిస్టుల గురించి విన్నాము. మంత్రివర్గం మార్పే అనుకున్నాం.

మరురోజు ఆందోళనకరమైన వార్త. జర్మన్ సిపాయిలు ప్రభుత్వ అనుమతితో హంగరీ భూభాగంలోకి చొచ్చుకొచ్చారని.

ఇక జనం ఆందోళన చెందనారంభించారు. నాన్న హితుడు మోషే ఛెమ్ బెర్కో విట్స్ 'పాస్‌ఓవర్' (ఇజ్రాయల్ ఈజిప్ట్ నుండి విముక్తి చెందిన సందర్భంగా జరుపుకునే పండుగ)కి రాజధాని నగరం నుంచి వచ్చాడు. "బుడాపెస్టు ప్రజలు భయభ్రాంతులతో నివసిస్తున్నారు. ప్రతిరోజు యూదులకు వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫాసిస్టులు యూదుల షాపులు, సినెగాగ్‌ల మీద విరుచుకు పడుతున్నారు. పరిస్థితి దారుణంగా మారుతున్నది" అన్నాడు.

ఆ వార్తలు సిఘెట్ అంతా వ్యాపించాయి. అందరూ ఆ విషయాలే ప్రస్తావిస్తున్నారు. కానీ త్వరలోనే ఆశాభావం తిరిగి

వచ్చింది. జర్మన్లు ఇంత దూరం రాలేరు. వాళ్ళు బుడాఫెస్ట్‌లోనే ఉండిపోతారు. రాజకీయ ఎత్తుగడల కారణాల వల్ల అని ఆశించారు. కానీ మూడు రోజులలోనే – జర్మన్ వాహనాలు మా వీధుల్లో తిరగసాగాయి.

జర్మన్ సిపాయిలు మృత్యువును చూపే గుర్తు గల స్టీలు హెల్మెట్లు ధరించి కనిపించినా ఏదో ఆశ. కొందరు జర్మను ఆఫీసర్లు మా యిళ్ళల్లో ఉంటున్నా నమ్రతగానే ఉన్నట్లు ఉన్నారు. వాళ్ళు తగని డిమాండ్లు ఏమీ చేయలేదు. చెడుగా మాట్లాడలేదు. ఒక్కోసారి యింటి యజమానురాలు వైపు చిరునవ్వుతో చూసేవారు. ఒక జర్మను ఆఫీసరు మా యింటి ఎదురుగా కాహ్నా ఇంటిలోనే బస చేశాడు. మర్యాదస్తుడనిపించాడు. ఒకనాడు మిసెస్ కాహ్నాకి చాక్‌లెట్ డబ్బా తెచ్చియిచ్చాడు. కొందరు జర్మన్ల గురించి మంచిగా మాట్లాడుతున్నారు కూడా.

'పాస్‌ఓవర్' ఎనిమిది రోజులూ వాతావరణం బాగున్నది. మా అమ్మ వంట యింటి పనులు చూసుకుంటున్నది. సినెగాగులు మూతబడ్డాయి. జనం ప్రైవేటు ఇళ్ళల్లోనే కలుసుకున్నారు. జర్మన్లను రెచ్చగొట్ట గూడదనే ఉద్దేశ్యంతో.

ప్రతి రబీ యిల్లు ప్రార్థనా మందిరమయింది.

మామూలుగా తింటున్నాం, ఆడుతున్నాం, పాడుతున్నాం. బైబిలు ఈ ఎనిమిది రోజులూ ఆనందంగా గడపమని చెబుతున్నది. కాని మాలో ఉత్సాహం లేదు. ఈ వేడుక రోజులు, త్వరగా

గడిచిపోతే చాలు అనుకున్నాం. ఏడవరోజు జర్మన్లు కొందరు మా కమ్యూనిటీ నాయకుల్ని అరెస్ట్ చేశారు. ఆనాటి నుండి అన్నీ వేగంగా జరిగిపోతున్నాయి. మేము మా మృత్యువు ముఖంలోకి పోతున్నామని తెలిసింది.

మొదటి ఆర్డరు – మూడు రోజులు యూదులెవ్వరూ యిళ్ళ నుండి బయటికి రాగూడదు, వస్తే చావే శిక్ష.

మోషే పరుగు పరుగున మా యింటికి వచ్చాడు. "నేను ముందే వార్నింగు యిచ్చాను" అంటూ వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు.

అదేరోజు హంగరీ పోలీసులు యూదులందరి యిళ్ళలోకి చొచ్చుకుని వచ్చారు. ఏ ఒక్క యూదు దగ్గర, బంగారం, నగలు యితర విలువైన వస్తువులూ ఉండరాదు. అన్నీ అధికారులకు అప్పజెప్పాలి. మా నాన్న మా బేస్‌మెంట్‌లోకి పోయి మా వస్తువులు పాతిపెట్టాడు. మా అమ్మ యధావిధిగా అన్ని పనులూ చేసుకుంటూ పోయింది. ఒక్కోసారి మావైపు అలా చూస్తూ ఉండిపోయేది మాటాపలుకూ లేకుండా.

మూడు రోజుల, తదుపరి ప్రతి యూదు పసుపు పచ్చ నక్షత్రాలు ధరించాలి అని ఆర్డరు. కమ్యూనిటీ లీడర్లు మా నాన్న సలహా కోసం వచ్చారు. ఆయనకు హంగరీ పోలీసు అధికారులతో పరిచయం ఉన్నది. నాన్న వారిని యింకా భయపెట్టకూడదని పరిస్థితి అంత విషమంగా లేదన్నాడు. పసుపు పచ్చ నక్షత్రమా,

అదేమంత ప్రాణాంతకమయింది కాదుగా అన్నాడు. పిచ్చినాన్న దానితోనే చనిపోయాడుగా!?

మిగతా ఆర్డర్లు వెంటనే వచ్చాయి. యూదులెవ్వరూ హొటళ్ళల్లోకి వెళ్ళగూడదు. ట్రెయిన్ ప్రయాణాలు నిషిద్ధం. సిన్‌గాగ్స్‌కి పోకూడదు. సాయంత్రం 6 గంటల తరువాత రోడ్లమీద కనిపించగూడదు.

తరువాత ఘట్టం గెటోలు (ఆనాటి మైనారిటీ పేదల ఇళ్ళు)

సిఘెట్‌లో గెటోలు సృష్టించారు. పెద్ద గెటో ఊరి మధ్యలో నాలుగు రోడ్ల కూడలిలో, చిన్న గెటో ఊరి బయట అనేక గల్లీలు కలుపుతూ వచ్చింది. మేముండే సర్పెంట్‌స్ట్రీట్ పెద్దగెటో కిందికి రావటం వలన మేము మా ఇంటిలోనే ఉండగలిగాము. రోడ్డు వైపుకున్న కిటికీలన్నీ మూసివేశారు. ముందు కొన్ని గదులు బంధువులకిచ్చాం. వారు వాళ్ళ యిళ్ళ నుండి తరిమి వేయబడ్డారు.

నెమ్మదిగా ఆ జీవితానికి అలవాటు పడ్డాం. మమ్మల్ని దాటనీయని ముళ్ళకంచ మాకంత యిబ్బంది అనిపించలేదు. మంచిదే లోపల ఉన్నవాళ్ళం అందరం కలసి మెలసి ఉంటు న్నామని సంతోషించాం. చిన్న యూదు కౌన్సిల్ ఏర్పడింది. యూదు పోలీస్ ఫోర్స్, వెల్‌ఫేర్ ఏజన్సీ, లేబర్ కమిటీ, హెల్త్ ఏజన్సీ ఏర్పడ్డాయి – చిన్న యూదు రిపబ్లిక్ అన్నమాట.

ఇది బాగానే ఉన్నదని అనుకున్నారు జనం. మా కిష్టంలేని ఆ పోలీసుల ముఖాలు చూడనవసరం లేదు అని సర్దుకున్నాం. యూదులం కలిసి బ్రతుకుతున్నామనుకున్నాం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kalaratri**

* * *